క్లుప్తంగా

వైవీ సుబ్బారెడ్డిని కలిసిన తన్నీరు



జగ్గయ్యపేటఅర్బన్: రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్ సీపీ ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల రీజనల్ కోఆర్డినేటర్ వైవీసుబ్బారెడ్డిని ఆపార్టీ జగ్గయ్యపేట నియోజకవర్గ ఇన్‌చార్జి తన్నీరు నాగేశ్వరరావు, బీసీ సెల్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి బత్తుల రామారావు ఆదివారం తాడేపల్లిలో మర్యాద పూర్వకంగా కలిశారు.జగ్గయ్యపేట నియోజకవర్గంలో పార్టీ నిర్వహిస్తున్న కార్యక్రమాలను వైవీకి వివరించినట్లు తన్నీరు నాగేశ్వరరావు తెలిపారు. వైవీని కలిసినవారిలో తన్నీరు తనయుడు సాగర్ కూడా ఉన్నారు.

నేటి నుంచి ఆధార్ క్యాంపులు

వత్సవాయి : మండలంలోని ఆయా గ్రామ సచివాలయాల్లో సోమవారం నుంచి ఆధార్ క్యాంపలను ఏర్పాటు చేస్తున్నట్లు ఎంపీడీవో ఎస్. రాంబాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 24వతేదీ సోమవారం పెద్దమోదుగపల్లి, వేమవరం, 25న మంగొల్లు, దబ్బాకుపల్లి, 28న భీమవరం, లింగాల గ్రామ సచివాలయాల్లో ఈ ఆధార్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఉదయం పది గంటల నుంచి సాయంత్రం ఐదుగంటల వరకు ఈ క్యాంపులు కొనసాగుతాయన్నారు. ఆధార్‌లో పేరు మార్పులు, అడ్రసులు తదితర మార్పుల కోసం ఈ క్యాంపులలో సంప్రదించాలని ఆయన సూచించారు.

చెత్త సేకరణ రిక్షా వితరణ



నందిగామరూరల్: మండలంలోని లింగాలపాడు గ్రామ పంచాయతీకి చెత్త సేకరణ రిక్షాను అందజేసినట్లు కార్యదర్శి రామిరెడ్డి ఆదివారం తెలిపారు. గ్రామానికి చెందిన దిగుమర్తి బేబి సరోజిని ప్రథమ వర్ధంతి సందర్భంగా ఆమెభర్త నారాయణ, కుటుంబ సభ్యులు గ్రామంలో చెత్త సేకరించేందుకు అవసరమైన రిక్షాను పంచాయతీకి బహూకరించారని వివరించారు. చెత్త సేకరణ రిక్షాను అందజేసిన దిగుమర్తి నారాయణ కుటుంబానికి రామిరెడ్డి కృతజ్ఞతలు తెలియజేశారు.

ఘనంగా పాఠశాల వార్షికోత్సవం



జగ్గయ్యపేటఅర్బన్: స్థానిక విజ్ఞాన్‌నగర్‌లోని విజ్ఞాన్ హైస్కూల్ వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా స్కూల్ డైరెక్టర్ తన్నీరు సుధారాణి మాట్లాడుతూ నిత్యం అకడమిక్ విధులతో ఒత్తిడితో ఉండే విద్యార్థులకు మానసిక ఉల్లాసం కలిగించే ఉద్దేశంతో ఈ విజ్ఞాన్ వైభవ్ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు వివరించారు. తల్లిదండ్రుల ఆశలు, ఆశయాలకు అనుగుణంగా విద్యార్థుల భవిష్యత్‌ను తీర్చిదిద్దుతున్నట్లు తెలిపారు. అనంతరం ఇటీవల నిర్వహించిన స్పోర్ట్స్ మీట్ విజేతలకు బహుమతులను అందజేశారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అందరినీ అలరించాయి.

ప్రజా సమస్యల పరిష్కార వేదిక రద్దు

కంచికచర్ల: స్థానిక రెవెన్యూ కార్యాలయంలో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కా వేదిక కార్యక్రమాన్ని ఈనెల 24వతేదీ సోమవారం రద్దు చేసినట్లు ఇన్‌చార్జి తహసీల్దార్ వేమూరి మానస ఆదివారం తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ నేపథ్యంలో ఈ కార్యక్రమాన్ని వాయిదా వేసినట్లు ఆమె వివరించారు. మండల ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని ఆమె కోరారు.

42 మద్యం సీసాలు స్వాధీనం

నందిగామటౌన్(నందిగామరూరల్): మద్యం అక్రమ విక్రయాలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ కెవీ సుధాకర్ హెచ్చరించారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ కమిషనర్ ఆదేశాల మేరకు నందిగామ పట్టణంలోని జానకిరామయ్య కాలనీలో సిబ్బంది శనివారం రాత్రి దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో నవరం దుర్గ, విజిత అనే మహిళల వద్ద నుంచి 42 తెలంగాణ మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు సుధాకర్ ఆదివారం తెలిపారు. దాడుల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్ఐ రామశేషయ్య, సుబ్బారావు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు ఆలయ వార్షికోత్సవం

జగ్గయ్యపేటఅర్బన్: పట్టణంలోని దుర్గాపురంలో వేంచేసియున్న శ్రీకనకదుర్గఅమ్మవారి ఆలయ 31వ వార్షికోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు ఆదివారం తెలిపారు. వార్షికోత్సవాల్లో భాగంగా ఉదయం అమ్మవారికి పంచామృత అభిషేకాలు, ప్రత్యేక అలంకరణ, చండీ రుద్రహోమం, సామూహిక కుంకుమార్చన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ ప్రైవేటు ఇంప్రూమెంట్ కమిటి సభ్యులు రామిశెట్టి నరసింహారావు, వెంకటేశ్వరరావు, తిరుమలశెట్టి శేషుకుమార్, అనిల్, కొల్లు గోవిందు, మేకం భాస్కర్ తెలిపారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేయనున్నట్లు వివరించారు. అధికసంఖ్యలో భక్తులు పాల్గొనాలని వారు కోరారు.

గుప్పుమంటున్న గంజాయి

- కంచికచర్ల ప్రాంతంలో జోరుగా విక్రయాలు
- తరచూ పట్టుబడుతున్న గంజాయి
- గంజాయి విక్రయాలపై ఆందోళనలో విద్యార్థుల తల్లిదండ్రులు



గతనెల 23వ తేదీన పట్టుబడిన 10కేజీల గంజాయి, నిందితులతో పోలీసులు (ఫైల్)

కంచికచర్ల: కూటమి ప్రభుత్వం వచ్చాక కంచికచర్ల ప్రాంతంలో గంజాయి గుప్పుమంటోంది. యువతే లక్ష్యంగా గంజాయి విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. ముఖ్యంగా ఇతర ప్రాంతాల నుంచి గంజాయిని తీసుకువచ్చి ఇక్కడి యువతకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. ఎక్సైజ్, పోలీస్ అధికారులు మొక్కుబడి చర్యలకే పరిమితమవుతుండటంతో కంచికచర్ల ప్రాంతంలో గంజాయి విక్రయాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. యువత గంజాయి మత్తులో జోగుతూ నేరాలకు పాల్పడుతూ శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తోంది. గంజాయి, మాదక ద్రవ్యాలపై ఉక్కుపాదం మోపుతామంటూ కూటమి ప్రభుత్వం ఆర్భాటంగా ఏర్పాటు చేసిన ఈగల్(ఎలైట్ యాంటీ నార్కోటిక్స్ గ్రూప్ ఫర్ లా ఎన్‌ఫోర్స్‌మెంట్) టీమ్ పనితీరు ఏమాత్రం ఆశాజనకంగా లేకపోవడమే ఇందుకు కారణమనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

యువత, విద్యార్థులే లక్ష్యంగా....

ప్రధానంగా యువత, విద్యార్థులే లక్ష్యంగా విక్రయాలు సాగుతున్నాయి. తొలుత సరదాగా అలవాటు చేసుకున్నవారు మత్తుకు బానిసలవుతున్నారు. ఈ గంజాయి సేవించే యువత తల్లిదండ్రులు ఇచ్చే పాకెట్ మనీని గంజాయికే ఖర్చు చేస్తున్నారు. మత్తుకు సరిపడా నగదు లేనివారు స్మగ్లర్లుగా అవతారమెత్తుతున్నారు. కొంతమంది అయితే కమిషన్ పద్ధతిపై గంజాయి అక్రమ రవాణాకు పాల్పడుతున్నట్లు సమాచారం. నిందితులు గంజాయి మత్తులో నేరాలకు పాల్పడుతున్నట్లు పోలీసుల విచారణలో బయటపడుతుండటం పరిస్థితి ఎంత తీవ్రంగా ఉందో వెల్లడిస్తోంది.

పోలీస్‌స్టేషన్‌కు కూతవేటు దూరంలో...

కంచికచర్ల పోలీస్‌స్టేషన్‌కు కూత వేటు దూరంలో రాత్రి సమయాల్లో ఆర్టీసీ బస్టాండ్ పరిసర ప్రాంతాల్లో నిత్యం కొంతమంది యువకులు గంజాయిని సేవిస్తున్నారు. కంచికచర్ల మండలంలో ఉన్న పలు ఇంజినీరింగ్ కళాశాలల సమీపంలో గంజాయి విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. ఇటీవల ఓ ఇంజినీరింగ్ కళాశాల సమీపంలో ముగ్గురు విద్యార్థులు గంజాయి మత్తులో ఇంట్లో ఉన్న యువతితో అసభ్యకరంగా ప్రవర్తించిన ఘటన విద్యార్థిలోకాన్ని భయాందోళనకు గురిచేసింది.

ఇంజినీరింగ్ కళాశాలల సమీపంలో..

గతనెల 23వతేదీన కంచికచర్ల హైవే సమీపంలోని ఓ వెంచర్‌లో ఏడుగురు వ్యక్తులు కలిసి పదికేజీల గంజాయిని విక్రయిస్తుండగా పోలీసులు స్వాధీనం చేసుకోగా, ఇక్కడికి కొద్దిదూరంలోనే ఇంజినీరింగ్ కళాశాలలు ఉండటం గమనార్హం. గత ఆరునెలల కాలంలో కంచికచర్ల మీదుగా ఇతర ప్రాంతాలకు రవాణా అవుతున్న సుమారు 800 కేజీల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకోవడం గంజాయి రవాణా ఏస్థాయిలో సాగుతోందో అర్థమవుతోంది. కంచికచర్లలో చాప కింద నీరులా సాగుతున్న గంజాయి విక్రయాలకు యువత ఆకర్షిలవుతుండటంపై తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. కంచికచర్లలోని ఆయా ప్రాంతాల్లో గుట్టుచప్పుడుగా సాగుతున్న ఈ గంజాయి విక్రయాలతోపాటు గంజాయి తాగేవారిపై ఎక్సైజ్, పోలీసు శాఖల అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

మందుబాబులకు అడ్డాగా పాఠశాల



గతేడాది వరదలకు కూలిపోయిన పాఠశాల ప్రహరీ



పాఠశాల ఆవరణలో పడేసి ఉన్న మద్యం సీసాలు

- పాఠశాల ఆవరణలో మద్యం సేవిస్తున్న మందుబాబులు
- మద్యం సీసాలు అక్కడే పడేస్తున్న వైనం
- ప్రహరీ లేకపోవడమే కారణం
- ఇబ్బందుల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు

ముచ్చింతాల(పెనుగంచిప్రోలు): గతేడాది సెప్టెంబర్‌లో సంభవించిన భారీ వరదలకు దెబ్బతిన్న పెనుగంచిప్రోలు మండలం ముచ్చింతాల ప్రభుత్వ పాఠశాల ప్రహరీని పునర్నిర్మించాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఈ వరదలకు పాఠశాల బాగా దెబ్బతింది. వరద నీరు పాఠశాల మీదుగా ప్రవహించడంతో పాఠశాల ఆవరణ అంతా మట్టి మేట మేసింది. తరగతి గదుల్లో ఐదు అడుగుల మేర వరద నీరు ప్రవహించింది. వరద బీభత్సానికి పాఠశాలకు తూర్పు, దక్షిణం వైపు ప్రహరీ గోడలు పడిపోయాయి. రెండు ఐఎఫ్‌పీ ప్యానెల్స్, స్మార్ట్ టీవీ, టాయిలెట్ బ్లాక్‌లో ఇసుక మేట వేయడంతోపాటు డోర్స్ పూర్తిగా దెబ్బతిన్నాయి. నాటి వరద ఉధృతికి ప్రహరీ గోడలు కూలిపోవటంతో ఆకతాయిలు పాఠశాల పరిసరాలను అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మార్చారు. రాత్రి సమయంతోపాటు, సెలవు దినాల్లో పలువురు పాఠశాల ఆవరణలోనే మద్యం తాగుతూ మద్యం సీసాలు, గ్లాసులు అక్కడే పడేస్తుండటంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బందులుపడుతున్నారు. వరద వచ్చి నెలలు గడుస్తున్నా పాఠశాల ప్రహరీ గురించి ఎవరూ పట్టించుకోవటం లేదని గ్రామస్తులు చెబుతున్నారు. విద్యాశాఖ అధికారులు తక్షణమే స్పందించి పాఠశాలకు ప్రహరీ నిర్మించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. ఈ విషయంపై ఎంఈవో డి.రవీంద్రను వివరణ కోరగా పాఠశాల ప్రహరీ, ఇతర మరమ్మతుల గురించి ప్రధానోపాధ్యాయుడు ఇచ్చిన నివేదికను ప్రభుత్వానికి పంపించినట్లు తెలిపారు. నిధులు రాగానే మరమ్మతులు చేయిస్తామని వివరించారు.

నిత్యాన్నదానానికి విరాళాలు

తిరుమలగిరి(జగ్గయ్యపేట): గ్రామంలో వేంచేసియున్న వాల్మీకోద్భవ వెంకటేశ్వరస్వామి వారి ఆలయంలో అమలవుతున్న నిత్యాన్నదాన పథకానికి పలువురు భక్తులు ఆదివారం విరాళాలు అందించినట్లు ఆలయ ఏసీ వరప్రసాద్ తెలిపారు. తెలంగాణ రాష్ట్రం సంగారెడ్డి జిల్లా తాళ్లూరుకు చెందిన రావూరి ముత్తయ్య రూ. 25,116, ఖమ్మం జిల్లా రఘునాథపాలెంనకు చెందిన చిమ్మపూడి నాగలవీరయ్య రూ. 25,116లను విరాళంగా అందించారని ఏసీ వివరించారు. ఆలయ అధికారులు దాతలను స్వామివారి చిత్రపటం, ప్రసాదాలతో సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ భరద్వాజ్, అర్చకులు తిరునగరి రామకృష్ణమాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన సిలువగిరి ఉత్సవాలు



క్రీస్తు సందేశాన్ని అందిస్తున్న పీఠాధిపతి తెలగతోటి జోసెఫ్ రాజారావు

నందిగామ రూరల్: మండలంలోని పల్లగిరి గట్టుపై ఉన్న పరిశుద్ధ సిలువగిరి పుణ్యక్షేత్ర మహోత్సవాలు ఆదివారంతో ఘనంగా ముగిశాయి. మహోత్సవాల్లో భాగంగా సమిష్టి దివ్య బలిపూజ, క్రీస్తు స్వస్థతా ప్రార్థన, వితరణ సమర్పణ కార్యక్రమాలను నిర్వహించారు. వేలాది మంది భక్తులతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈసందర్భంగా విజయవాడ పీఠాధిపతి డాక్టర్ తెలగతోటి జోసఫ్ రాజారావు మాట్లాడుతూ దైవసందేశం అందించారు. మనుషుల పాపవిమోచనకే ఏసుక్రీస్తు ఈ లోకానికి వచ్చి సిలువపై రక్తాన్ని చిందించారని పేర్కొన్నారు. అనంతరం దావీదు విజయం బైబిల్ నాటకం, సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఫాదర్‌లు ఫిలోమెన్ రాజు, బెన్నీ, తంబి, దత్తు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

తెలుగుభాష విశిష్టమైనది

జగ్గయ్యపేటఅర్బన్: జగ్గయ్యపేట రచయితల సంఘం(జరసం) ఆధ్వర్యంలో మాతృభాషా దినోత్సవం వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక గిరిజన బాలుర గురుకుల పాఠశాలలో జరిగిన వేడుకలకు జరసం ఉపాధ్యక్షుడు, కవి, బత్తుల బ్రహ్మయ్య అధ్యక్షత వహించారు. తెలుగుభాష విశిష్టతను చాటుతూ పద్యాలను పాడి వినిపించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న విశ్రాంత ఉపాధ్యాయులు కేశవరావు మాట్లాడుతూ తెలుగుభాష గొప్పతనాన్ని వివరించారు. విశ్రాంత అధ్యాపకులు, జరసం అధ్యక్షుడు అబ్బాస్‌అలీ మాట్లాడుతూ అమ్మభాషను ఆదరించాలన్నారు. తెలుగుభాష విశిష్టమైనదని పేర్కొన్నారు. కవి, సాహిత్యవేత్త సరికొండ నరసింహరాజు మాట్లాడుతూ తెలుగుభాష పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. విద్యార్థులకు పద్యాల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.

ముక్తేశ్వరుని కల్యాణోత్సవాలు ప్రారంభం



ఆలయంలో సంప్రోక్షణ చేస్తున్న అర్చకులు



పెండ్లికుమారుడి అలంకరణలో స్వామివారు

ముక్త్యాల(జగ్గయ్యపేట): గ్రామంలో వేంచేసియున్న భవానీ ముక్తేశ్వరస్వామి వారి కల్యాణోత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. కల్యాణోత్సవాల్లో భాగంగా తొలిరోజు కృష్ణానది ఒడ్డునున్న ముక్తేశ్వరస్వామి వారి ఆలయంలో అర్చకులు సాంబశివరావు ఆధ్వర్యంలో సంప్రోక్షణ,ప్రత్యేక పూజలు చేశారు. కృష్ణానదీ జలాలతో పూజచేసి కల్యాణ మహోత్సవాలు ప్రారంభిస్తున్నట్లు సంకల్పం చేశారు. అనంతరం స్వామివారిని పెండ్లి కుమారునిగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఈఓ సురేష్‌బాబు, కేసీపీ ప్రతినిధులు, గ్రామస్తులు, పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

26న అమృత లింగేశ్వరుని కల్యాణం..

ముక్త్యాల(జగ్గయ్యపేట): ఈనెల 26వతేదీ మహాశివరాత్రిని పురస్కరించుకుని ముక్త్యాల గ్రామ సమీపంలోని కోటిలింగ హరిహర మహాక్షేత్రంలోని కామాక్షి సమేత పంచముఖ అమృతలింగేశ్వరస్వామి వారి కల్యాణ్యాన్ని అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు ఈఓ హరిదుర్గానాగేశ్వరరావు ఆదివారం తెలిపారు. శివరాత్రి సందర్భంగా ఉదయం నుంచి స్వామివారికి సర్వదర్శన అభిషేకాలు, శివలింగ ప్రతిష్ఠలు, ప్రదోషకాల అన్నాభిషేకం, భస్మాభిషేకం, పంచామృతాభిషేకాలతోపాటు అర్ధరాత్రి 12గంటలకు లింగోద్భవ కాలాభిషేకం, అమృతలింగేశ్వరస్వామివారి కల్యాణంను నిర్వహించనున్నట్లు వివరించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొనాలని ఈఓ కోరారు.

వైభవంగా స్వామివారి కల్యాణం



స్వామివారి కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

జగ్గయ్యపేటఅర్బన్: పట్టణ సమీపంలోని విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ మైన్స్ క్వార్టర్స్ ప్రాంగణంలో ఉన్న శ్రీభూసమేత కల్యాణ వెంకటేశ్వరస్వామి వారి కల్యాణోత్సవాన్ని ఆదివారం వైభవోపేతంగా నిర్వహించారు. వీఎస్‌పీ పూర్వ ఉద్యోగి, వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ బి.భీమరాజు, నాగదుర్గ దంపతుల ఆధ్వర్యంలో స్వామివారి కల్యాణ మహోత్సవాల కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు టీఎల్ఎన్ ఆచార్యులు ఆధ్వర్యంలో తిరునగరి సంపత్ జానకీరామ్ యాగ్నిక నిర్వహణలో జరిగిన ఈ కల్యాణోత్సవంలో వీఎస్‌పీ జేఎల్ఎం ఇన్‌చార్జి నాగరాజు దంపతులు, వీఎస్‌పీ జేఎల్ఎం డాక్టర్ కుసుమ నరేష్, ఉద్యోగులు ఆంజనేయులు, మోహనరావు, భారీసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

జగ్గయ్యపేటఅర్బన్: పట్టణంలోని బలుసుపాడు రోడ్డులో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో 2025–26 విద్యా సంవత్సరంలో ఐదోతరగతి, ఇంటర్ ప్రథమ సంవత్సరంలో చేరేందుకు బాలికల నుంచి ఆన్‌లైన్ దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ కె.లక్ష్మీసుజాత ఆదివారం తెలిపారు. ఈనెల 7వ తేదీ నుంచి మార్చినెల 6వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చున్నారు. ఏప్రిల్ 6వ తేదీ ఉదయం 10 గంటలకు 5వ తరగతి వారికి, మధ్యాహ్నం 2గంటలకు ఇంటర్‌లో చేరేవారికి ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు ఆమె తెలిపారు. అర్హులైన వారందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

ఉద్యోగ భద్రత కల్పించాలని వినతి



ఎమ్మెల్యే సౌమ్యకు వినతిపత్రం అందజేస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు

నందిగామటౌన్(నందిగామ రూరల్): గృహ నిర్మాణ శాఖలో విధులు నిర్వహిస్తున్న తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు శేషం తిరుపతిరావు కోరారు. తమకు ఉద్యోగ భద్రత కల్పించడంతోపాటు హౌసింగ్ కార్పొరేషన్ ఉద్యోగులుగా గుర్తించాలని కోరుతూ ఉద్యోగులు ఆదివారం ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఉద్యోగులు మాట్లాడుతూ గడిచిన 18 ఏళ్లుగా చాలీచాలని వేతనాలతో విధులు నిర్వహిస్తున్నామన్నారు. పెరిగిన నిత్యావసర ధరలతో కుటుంబపోషణ భారంగా మారుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు ఉద్యోగభద్రత కల్పించి, వేతనాలను పెంచాలని కోరారు. కార్యక్రమంలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సంఘం నాయకులు రామారావు, సాయికుమార్, నాగరాజు, దిలీప్‌కుమార్, గోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి సంగమేశ్వరుని కల్యాణోత్సవాలు



విద్యుద్దీప కాంతుల్లో దాములూరు కూడలి సంగమేశ్వరస్వామి ఆలయం

నందిగామరూరల్: మండలంలోని దాములూరు కూడలి గ్రామంలో వేంచేసియున్న పర్వతవర్ధిని సంగమేశ్వరస్వామి వారి కల్యాణ మహోత్సవాలు మంగళవారం నుంచి ప్రారంభం కానున్నాయి. మహోత్సవాలలో భాగంగా మంగళవారం గణపతి పూజ, పుణ్యాహవచనం, మండపారాధన, అంకురారోహణ, అగ్నిప్రతిష్టాపన, ధ్వజారోహణం, పరియగీకరణ, బలిహరణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఈఓ నరసింహమూర్తి తెలిపారు. 26న మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా నిత్యఔపోసన, రుద్రహోమం, బలిహరణ, మూలమంత్ర హోమాలు, బలిహరణ కార్యక్రమాలతోపాటు రాత్రి 10 గంటలకు ఎదురుకోలోత్సవం అనంతరం లింగోద్భవ కాలంలో ప్రత్యేకంగా అలంకరించిన మండపంపై స్వామి వారి కల్యాణాన్ని వైభవోపేతంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు. 27న రుద్రాభిషేకం, రుద్రహోమం, పంచసూక్త హోమం, 28న శ్రీసూక్తదుర్గా సూక్త హోమాలు, వసంతోత్సవం, అమ్మవారికి కుంకుమార్చన, పూర్ణాహుతి పూజా కార్యక్రమాలతో ఉత్సవాలు ముగుస్తాయని ఈఓ తెలిపారు.



వైరా కట్టలేరు వద్ద ఏర్పాటు చేసిన జల్లు స్నానాలు

తిరునాళ్లకు పూర్తి ఏర్పాట్లు..

సంగమేశ్వరస్వామి కల్యాణం సందర్భంగా నాలుగురోజులపాటు సాగే తిరునాళ్ల మహోత్సవాలకు భక్తులకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు ఈఓ తెలిపారు. ఆలయాన్ని రంగులు, విద్యుత్ దీపకాంతులతో శోభాయమానంగా అలంకరించారు. ఆలయం వద్ద పుణ్యస్నానాలు, జల్లు స్నానాలకు ఏర్పాట్లు చేశారు. క్యూలైన్‌లు, బారికేడ్‌లు, పార్కింగ్ స్థలాలు ఏర్పాటుతోపాటు పుణ్యస్నానాల అనంతరం మహిళలు దుస్తులు మార్చుకునేందుకు వీలుగా గదులను సిద్ధం చేసినట్లు తెలిపారు. ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి వేలాదిగా తరలివచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేశామని ఈఓ వివరించారు.

గుంతల రోడ్డుతో గమ్యం చేరేదెలా?

- అధ్వానంగా జమ్మవరం–దాములూరు కూడలి రోడ్డు
- ప్రయాణికులకు తప్పని అవస్థలు



పల్లెంపల్లి గ్రామశివారులో రాళ్లు పైకిలేచి అధ్వానంగా ఉన్న రోడ్డు



వెల్లంకి సమీపంలో మోకాళ్లలోతు గుంతలతో ప్రమాదకరంగా ఉన్న ఆర్‌అండ్‌బీ రోడ్డు

వీరులపాడు: మండలంలోని జమ్మవరం నుంచి నందిగామ మండలం దాములూరు కూడలి గ్రామంలోని సంగమేశ్వరస్వామి వారి ఆలయానికి వెళ్లే ఆర్‌అండ్‌బీ రోడ్డు అధ్వానంగా ఉంది. గుంతలు, రాళ్లు పైకి లేచిపోయి ఉండటంతో ప్రయాణికులు ఇబ్బందులుపడుతున్నారు. మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా దాములూరు కూడలిలో జరిగే తిరునాళ్ల మహోత్సవానికి కంచికచర్ల, వీరులపాడు మండలాల నుంచి పెద్దసంఖ్యలో భక్తులు తరలివస్తారు. ఈ రెండు మండలాల భక్తులు, ప్రజలు జమ్మవరం, బోడవాడ, వెల్లంకి, కొణతాలపల్లి, పల్లంపల్లి మీదుగా దాములూరు కూడలి వెళ్లాల్సి ఉంది. జమ్మవరం నుంచి రోడ్డు మోకాళ్లలోతు గుంతలతో, రాళ్లు తేలి అధ్వానంగా దర్శనమిస్తోంది. ఈ రోడ్డులో ప్రయాణం ప్రమాదభరితంగా మారిందని ఆయా గ్రామాల ప్రజలు, భక్తులు వాపోతున్నారు. తిరునాళ్లకు ఉన్న ప్రాధాన్యం దృష్ట్యా ఇప్పటికైనా ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి ఈరోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమం



గండేపల్లిలో చెత్త సేకరణపై క్లాప్‌మిత్రకు అవగాహన కల్పిస్తున్న ఈఓపీఆర్డీ శ్రీనివాసరావు

కంచికచర్ల : తడి, పొడిచెత్తను విడివిడిగా సేకరించి చెత్త సంపద తయారీ కేంద్రానికి తరలించి వర్మీ కంపోస్టు తయారు చేసేందుకు సిబ్బంది ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఈఓపీఆర్డీ బొజ్జిగాని శ్రీనివాసరావు ఆదేశించారు. మండలంలోని గండేపల్లిలో స్పెషల్ శానిటేషన్ కార్యక్రమంలో భాగంగా తడిచెత్త, పొడి చెత్త సేకరణ విధానాన్ని ఆదివారం ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల్లో క్లాప్ మిత్రలు వీధుల్లో ప్రతి ఇంటి నుంచి తడి, పొడిచెత్తను విడివిడిగా సేకరించి చెత్త సంపద తయారీ కేంద్రానికి తరలించాలన్నారు. ప్రధానవీధులు, రోడ్లపై చెత్తను వేయరాదన్నారు. పరిసరాలను పరిశుభ్రం చేయడంతోపాటు డ్రెయినేజీల్లో మురుగునీరు పారుదల అయ్యేలా తగుచర్యలు తీసుకోవాలని పంచాయతీ పారిశుద్ధ్య సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో గండేపల్లి, పరిటాల పంచాయతీ కార్యదర్శులు జిల్లేపల్లి రత్నాకర్, ఎస్. సుబ్రహ్మణ్యం, సిబ్బంది పాల్గొన్నారు.

జగ్గయ్యపేట మండలంలో..

గౌరవరం(జగ్గయ్యపేట): గ్రామ పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులకు ప్రజలు తడిపొడి చెత్తను వేర్వేరుగా అందించాలని ఈవోపీఆర్డీ పద్మావతి సూచించారు. మండలంలోని గౌరవరం గ్రామంలో తడి, పొడి చెత్తపై ఆదివారం ఇంటింటి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఈఓపీఆర్డీ పద్మావతి మాట్లాడుతూ ప్రభుత్వం శని, ఆదివారాలలో గ్రామాల్లో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు. ప్రజలు కూడా అవగాహన కలిగి ఉండి తడి, పొడి చెత్తలను వేర్వేరుగా చేసి క్లాప్‌మిత్రలకు అందజేయాలని కోరారు.పంచాయతీ కార్యదర్శి సంక్రాంత్, సిబ్బంది, క్లాప్‌మిత్రలు పాల్గొన్నారు.



తడి,పొడి చెత్త సేకరణపై అవగాహన కల్పిస్తున్న ఈఓపీఆర్డీ పద్మావతి

అమ్మవారి దర్శనానికి పోటెత్తిన భక్తులు



పెనుగంచిప్రోలు: గ్రామంలో వేంచేసియున్న శ్రీతిరుపతమ్మ అమ్మవారి దర్శనానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. వివిధ జిల్లాల నుంచి తరలివచ్చిన భక్తులతో ఆలయం రద్దీగా మారింది. వేకువజాము నుండే భక్తులు పాలు, పొంగళ్లతో అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. వేలాదిగా తరలివచ్చిన భక్తులు, వారి వాహనాల కారణంగా పెనుగంచిప్రోలు అమ్మవారి ఆలయానికి వెళ్లే రోడ్లలో ట్రాఫిక్ స్తంభించింది. నాలుగు రోడ్ల కూడలి పోలీస్‌స్టేషన్ సెంటర్‌లో ట్రాఫిక్ ఇబ్బందులతో జనం ఇబ్బందిపడ్డారు. ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి అధికారులు తగిన చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.